క్లుప్తంగా

నూతన కార్యవర్గం ఎన్నిక



బ్రాహ్మణ అర్చక పురోహిత సమాఖ్య నూతన కార్యవర్గం

షాద్‌నగర్: బ్రాహ్మణ అర్చక పురోహిత సమాఖ్య షాద్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షుడిగా రవిశర్మను ఎన్నుకున్నారు. పట్టణంలోని టీచర్స్ కాలనీలోని ఓంకార ఆంజనేయస్వామి ఆలయంలో సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రవిశర్మ, ప్రధాన కార్యదర్శిగా రంగనాథశర్మ, కోశాధికారిగా భానుశర్మ, ఉపాధ్యక్షుడిగా రఘునాథ్ శర్మ, సహాయ కోశాధికారిగా రాజశేఖర్ శర్మ, సహాయ కార్యదర్శిగా మధుసూధనాచార్యులు, మీడియా ప్రతినిధిగా ప్రవీణ్ శర్మను ఎన్నుకున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న చంద్రారెడ్డి

మొయినాబాద్: సురంగల్–మొయినాబాద్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన క్యాలెండర్‌ను శుక్రవారం పీఏసీఎస్ చైర్మన్ చంద్రారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్‌ను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. రైతులకు పంటరుణాలు, దీర్ఘకాలిక రుణాలు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహేందర్, డైరెక్టర్లు నర్సింహారెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్, అనిత, భూపాల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి,యాదయ్య, సీఈఓ మనోహర్‌రెడ్డి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భక్తితోనే మానసిక ప్రశాంతత



మహాపడిని వెలిగిస్తున్న స్వాములు

మొయినాబాద్ రూరల్: భక్తితోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని చేవెళ్ల అసెంబ్లీ బీజేపీ ఓబీసీ కన్వీనర్ వెంకటేశ్‌గౌడ్ అన్నారు. శుక్రవారం బాకరం గ్రామంలో అయ్యప్ప స్వామి మహాపడి పూజను ఘనంగా నిర్వహించారు. భజన మండలి నిర్వహించిన అయ్యప్ప స్వామి పాటలతో గ్రామం మార్మోగింది. ఈ సందర్భంగా వెంకటేశ్‌గౌడ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ జీవితంలో భక్తిని అలవర్చు కోవాలని, తద్వారా శాంతి మార్గంలో నడిచేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. అయ్యప్ప స్వాములందరికీ అన్నదానం చేసిన వెంకటేశ్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల ఫోరం అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, భిక్షపతిగౌడ్, నర్సింహ, సంజీవరెడ్డి, స్వాములు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ రీడింగ్ స్కిల్స్ పెంచుకోవాలి



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాస్, సద్దాం హుస్సేన్

షాబాద్: ఇంగ్లిష్ పుస్తకాలతో విద్యార్థులు రీడింగ్ స్కిల్స్ పెంచుకోవాలని ఆకృతి ప్రాజెక్ట్ లీడ్స్ శ్రీనివాస్, సద్దాం హుస్సేన్ సూచించారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని పటేల్‌గూడ, తిర్మలాపూర్, కేసారం, కొమరబండ, ఎల్గొండగూడ, కేశవగూడ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఇంగ్లిష్ లైబ్రరీ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇంగ్లిష్ లైబ్రరీ పుస్తకాలను చదవడం ద్వారా రీడింగ్ స్కిల్స్ పెంచుకుంటారని తెలిపారు. ఆకృతి ప్రాజెక్టు ద్వారా విద్యార్థులకు బోధించేందుకు సుధారాణి అనే ఉపాధ్యాయురాలిని నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పటేల్‌గూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, ఆకృతి ప్రాజెక్ట్ ఫీల్డ్ ఆఫీసర్లు భిక్షపతి, అమీర్, పవిత్ర, రామకృష్ణ, నవిత, సంతోశ్ తదితరులున్నారు.

షర్మిలకు ఘన స్వాగతం



షర్మిలకు స్వాగతం పలుకుతున్న నేతలు

ఇబ్రహీంపట్నం: ఢిల్లీలో రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం శనివారం హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు వచ్చిన వైఎస్ షర్మిలకు ఇబ్రహీంపట్నంకు చెందిన ఆపార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. మాజీ సర్పంచ్ లక్ష్మయ్య, యువ నాయకులు చందు, రాజు తదితరులు షర్మిలను ఘనంగా సన్మానించారు.

'తుంపర' .. లాభాల పరంపర

షాబాద్ మండలంలో ఆకుకూరలు, కూరగాయల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. సాగు సాయం కోసం ప్రభుత్వం, బ్యాంక్‌లను ఆశ్రయించకుండా ఆదర్శంగా నిలుస్తున్నారు. మెట్ట ప్రాంతాల్లో కూడా బిందు, తుంపర సేద్యంతో సిరులు పడిస్తున్నారు. ప్రధానంగా పాలకూర, కొత్తిమేర, తోటకూర, పుంటికూర వంటి ఆకుకూరలకు మార్కెట్‌లల్లో డిమాండ్ ఉంది. ఈ పంటలన్నీ స్వల్పకాల వ్యవధిలో చేతికి వస్తాయి. ఏడాది పొడవునా ఆదాయాన్ని ఆర్జిస్తూ.. అందరి చేత శభాశ్ అనిపించుకుంటున్నారు మండలానికి చెందిన రైతులు.

- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ
- నీటి వినియోగం తక్కువే..
- ఆసక్తి చూపుతున్న రైతులు



స్పింక్లర్ల సాయంతో సాగు చేసిన క్యారెట్ పంట

షాబాద్: వ్యసాయరంగంలో వస్తున్న ఆధునిక పోకడలను రైతులు అనుకరిస్తున్నారు. సులభ పద్ధతిలో వ్యవసాయం చేయడం, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నారు. తక్కువ నీటితో ఎక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేసేందుకు సూక్ష్మ, తుంపర సేద్యం ఎంతో దోహదపడుతుంది. సాగునీటి ఎద్దడి ఉండే మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం వైపు రైతులు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా మెట్ట ప్రాంతాల్లో తుంపర సేద్యం ద్వారా రైతులు అధిక లాభాలు ఆర్జించే అవకాశం ఉంది. రైతులను తుంపర సేద్యం వైపు మళ్లించేందుకు ప్రభుత్వం కూడా సబ్సిడీలు ఇచ్చి అందుకు సంబంధించిన పరికరాలను అందిస్తోంది. ఆరుతడి పంటలైన క్యారెట్, బీట్‌రూట్, టమోటా, వంకాయ తదితర కూరగాయలు, ఆకుకూర పంటలను తుంపర సేద్యం ద్వారా విరివిగా పండించవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఆదర్శంగా నిలుస్తున్న రైతులు

షాబాద్ మండలం కూరగాయల సాగుకు పెట్టింది పేరు. మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతులు తమకున్న కొద్దిపాటి పొలంలో కూరగాయల సాగు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. భూ తల్లిని నమ్ముకుని తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. వారేమీ మోతుబరి రైతులు కారు. ఎకరాలకు ఎకరాల భూముల్లేవు. రెండు మూడు కుంటల్లో వివిధ కూరగాయలు, ఆకుకూరలు సాగుచేస్తూ పెద్ద రైతులకు ఏ మాత్రం తీసిపోకుండా.. అధిక ఆదాయాన్ని ఆర్జిస్తున్నారు. తక్కువ భూమిలోనే సిరులు పండించొచ్చని నిరుపిస్తున్నారు. షాబాద్ మండల పరిధిలోని గొట్లూరుగూడ, ముద్దెంగూడ, ఎర్రోనిగూడ, పోలారం, లక్ష్మరావుగూడ, గొపిగడ్డ, పోతుగల్, మాచన్‌పల్లి, అంతిరెడ్డిగూడ, మద్దూర్, మక్తగూడ, ఏట్ల ఎర్రవల్లి గ్రామాల రైతులు పదేళ్లగా కూరగాయాలు, ఆకుకూరలు పండిస్తూ ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నారు. సీజన్‌ను బట్టి ఆకుకూరలతో పాటు క్యారెట్, బీట్‌రూట్, టమోటా, వంకాయ, చిక్కుడు పంటను సాగుచేస్తున్నారు. ఒక్కసారి పాలకూర పంట వేస్తే నెల రోజుల వరకు ప్రతిరోజు రూ.400 సంపాదించుకుంటామని రైతులు చెబుతున్నారు. పొలాలు గ్రామాలకు సమీపంలో ఉండడంతో రవాణా భారం కూడా తగ్గుతోంది. భూగర్భజలాలు అడుగంటడంతో ఉన్న తక్కువ నీటితో కూరగాయాలు సాగుచేసి ఆర్థికాభివృద్ధి పొందుతున్నారు. నాణ్యమైన, తాజా ఆకుకూరల ఉత్పత్తికి గొల్లూరుగూడ, పోలారం, గొపిగడ్డ, మాచన్‌పల్లి, హైతాబాద్ గ్రామాలు పేరుపొందాయి. ప్రభుత్వ ప్రోత్సాహం కోసం, బ్యాంకుల ఆర్థిక సాయం కోసం రైతులు ఎదురుచూడకపోవడం గమనార్హం.

మంచి డిమాండ్ ఉంది



మేం సాగు చేసిన కూరగాయాలు, ఆకుకూరలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. కూరగాయాల సాగుతోనే కుటుంబాలను పోషించుకుంటున్నాం. మా గ్రామం కూరగాయాల సాగుకు పెట్టింది పేరు.

– సామ ప్రతాప్‌రెడ్డి, రైతు, ఎర్రోనిగూడ

లాభసాటిగా ఉంది



క్యారెట్, బీట్‌రూట్, టమాటాలకు మంచి ధర పలుకుతోంది. ఏడాది పోడవునా మేం కూరగాయలు సాగు చేస్తాం. ఒక పంట పోయిన మరో పంటలో లాభాలు వస్తున్నాయి. డ్రిప్, స్పింక్లర్‌ల సహాయంతో నీటిని పొదుపుగా వాడుకొని వంటలు సాగు చేస్తున్నాం.

– వడ్ల నర్సింహాచారి, రైతు, గోల్లూరుగూడ

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

చిలుకూరు భ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన ఆలయం

మొయినాబాద్: చిలుకూరు భ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మండల పరిధిలోని చిలుకూరు భ్రమరాంబ మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు ప్రతి సంవత్సరం సంక్రాంతికి ముందు నిర్వహిస్తారు. అందులో భాగంగా శనివారం రాత్రి గంగ స్నానంతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. 7వ తేదీ ఉదయం 9 గంటలకు ధ్వజారోహణం, అభిషేకం, 10 గంటలకు ఎల్లమ్మ లగ్నము, మధ్యాహ్నం 1 గంటలకు ఎల్లమ్మ బోనాలు, 1.30 గంటలకు భ్రమరాంభ మల్లికార్జునస్వామి కల్యాణోత్సవం, సాయంత్రం 4 గంటలకు బోనాల ఊరేగింపు, 5 గంటలకు శివసత్తులు అగ్నిగుండాలు తొక్కుట, 5.30 గంటలకు ఒగ్గువారు ఉక్కు గొలుసు తెంపుట, రాత్రి 8 గంటలకు ఒగ్గుకథ కార్యక్రమాలుంటాయి. 8వ తేదీ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు సదరుపటం తొక్కుట, సాయంత్రం 5 గంటలకు చిలుకూరు గ్రామంలో స్వామివారి ఊరేగింపు, 9న మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు నల్లపోచమ్మ బోనాల ఊరేగింపు నిర్వహిస్తారు.

ఇంటింటికీ అయోధ్య అక్షింతలు



ర్యాలీగా గ్రామాలకు అక్షింతలు తీసుకెళ్తున్న భక్తులు

చేవెళ్ల: అయోధ్య రామమందిరం నుంచి తెచ్చిన శ్రీరాముడి అక్షింతలకు శుక్రవారం చేవెళ్ల మండల కేంద్రంతో పాటు కౌకుంట్ల మడికట్లు, ఊరేళ్ల తదితర గ్రామాల్లో తీర్థక్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. జనవరి 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం జరుగుతుందని, ప్రతి ఒక్కరూ అక్షింతలు తీసుకోవాలని ట్రస్ట్ నిర్వాహకులు సూచించారు. చేవెళ్లలో లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి గ్రామంలోని హనుమాన్ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు మాట్లాడుతూ ఐదు శతాబ్దాల నిరీక్షణ తర్వాత అయోధ్య రామాలయ ప్రతిష్ఠ జనవరి 22న జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామ ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

అక్షింతల పంపిణీ

షాబాద్: అయోధ్య రామ మందిర అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తున్నట్లు లక్ష్మరావుగూడ సర్పంచ్ అనిత పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని లక్ష్మరావుగూడ గ్రామంలో అక్షింతలతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం హనుమాన్ ఆయలంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అయోధ్య శ్రీరామ మందిరం ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, గ్రామస్తులు శ్రీనివాస్, బంటు కిష్టయ్య, కుమార్, చంద్రారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఎల్లారెడ్డి, బోజిరెడ్డి, నాగిరెడ్డి, గ్రామస్తులు తదితరులున్నారు.

సమాజ సేవలో ముందుండాలి



దొంతాన్‌పల్లి పాఠశాల విద్యార్థులతో ఇక్ఫాయి కళాశాల విద్యార్థులు

శంకర్‌పల్లి: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఇక్ఫాయి బిజినెస్ స్కూల్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ గణేశ్ ఆకాంక్షించారు. ఇక్ఫాయి కళాశాల బిజినెస్ స్కూల్ ఎంబీఏ విద్యార్థులు, సంకల్ప్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని దొంతాన్‌పల్లి ప్రాథమిక పాఠశాలను రంగులతో అలంకరించారు. శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ గణేశ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. విద్యార్థి దశ నుంచే సామాజిక బాధ్యత, విలువలు, సంస్కృతి, సంప్రదాయాలను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దొంతాన్‌పల్లి సర్పంచ్ అశ్విని, ఇక్ఫాయి బిజినెస్ స్కూల్ డైరెక్టర్ ప్రొఫెసర్ వేణుగోపాల్, ప్రొఫెసర్‌లు మాధవి, సింధుజ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిరణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

మొయినాబాద్ రూరల్: ప్రజాపాలనలో అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని మండల అభివృద్ధి అధికారి సంధ్య కోరారు. దరఖాస్తు గడువు శనివారంతో ముగుస్తుందని తెలిపారు. శుక్రవారం 1,347 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ

శంకర్‌పల్లి: మోకిల సీఐగా వీరబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి క్రైం రేటును తగ్గించే విధంగా చూడాలన్నారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని, వారు వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు.

నందిగామ ఎస్‌హెచ్‌ఓగా ప్రసాద్

నందిగామ: నందిగామ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓగా ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడేందుకు కృషి చేస్తానని చెప్పారు. నందిగామ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌హెచ్‌ఓగా పనిచేసిన సురేశ్ బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

పాదయాత్రగా నారసింహుడి చెంతకు



యాదగిరిగుట్టకు బయలుదేరిన కనకరాజు

కొందుర్గు: కొందుర్గు గ్రామానికి చెందిన బోయ కనకరాజు అనే వ్యక్తి శుక్రవారం కొందుర్గు నుంచి యాదగిరిగుట్టకు పాదయాత్ర చేపట్టారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ షాద్‌నగర్ ఎమ్మెల్యేగా వీర్లపల్లి శంకర్ గెలుపొందడంతో పాటు, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహా స్వామి దర్శించుకొని మొక్కు చెల్లించుకుంటానని మొక్కుకున్నానని తెలిపారు. మొక్కులు తీర్చుకోవడం కోసం యాదగిరిగుట్టకు వెళ్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేందర్, రామయ్య గౌడ్, రామస్వామి, శ్యామ్, ప్రవీణ్, కృష్ణయ్య, కృష్ణ పాల్గొన్నారు.

యాచారంలో అయ్యప్ప పడిపూజ

యాచారం: మండల కేంద్రంలోని ధర్మశాస్త పుణ్యక్షేత్రంలో శుక్రవారం అయ్యప్పస్వామి ఇరుముడి పడిపూజ ఘనంగా జరిగింది. బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా, నారాయణశెట్టి గురుస్వామి ఆధ్వర్యంలో చందర్‌నాయర్ గురుస్వామి పర్యవేక్షణలో పూజ కార్యక్రమం జరిగింది.

ఉపాధ్యాయులే.. దేశ భవిష్యత్తు నిర్మాతలు

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



హెచ్‌ఎం దంపతులను సన్మానిస్తున్న లావణ్య

కొత్తూరు: దేశ భవిష్యత్తు ఉపాధ్యాయులపైనే ఆధారపడి ఉందని కొత్తూరు మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. కొత్తూరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం భాగ్యమ్మ వీడ్కోలు సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాగ్యమ్మను చైర్‌పర్సన్‌తో పాటు ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎంగా భాగ్యమ్మ చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులను ఉపాధ్యాయులు ఉన్నతంగా తీర్చిదిద్దాలని లావణ్య కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌యాదవ్, లక్ష్మయ్య, మాదారం నర్సింహాగౌడ్, శ్రీనుగౌడ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ

షాద్‌నగర్ రూరల్: మానవ సేవ మాధవ సేవతో సమానమని ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సంస్థ (ఎఫ్‌సీఎన్) వ్యవస్థాపకురాలు డాక్టర్ గీతా తోమాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎఫ్‌సీఎన్ సంస్థ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోటుబుక్కులు, స్కూల్ బ్యాగులు, డిక్షనరీలు, పుస్తకాలు, వృద్ధులకు, పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా అనాధ ఆశ్రమాన్ని నడుపుతూ అనాధలు, వృద్ధులను చేరదీస్తున్నామని తెలిపారు. అదేవిధంగా మహిళలకు ఉచితంగా కుట్టుశిక్షణ ఇవ్వడంతో పాటుగా కుట్టుమిషన్‌లు అందజేశామని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసాలపై తొందరొద్దు

ఇబ్రహీంపట్నం: పురపాలిక చైర్మన్లు, వైస్ చైర్మన్లపై అధికార పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాసాలు పెట్టొద్దని కాంగ్రెస్ నాయకుడుఈసీ శేఖర్‌గౌడ్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అధికార పార్టీ చైర్మన్లు, వైస్ చైర్మన్లపై అదే పార్టీకి చెందిన కౌన్సిలర్లు అవిశ్వాసాలు పెట్టాలని ప్రతిపాదించడం వలన కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం కలుగుతుందన్నారు. పార్టీకి నష్టం కలుగుతుందని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఈ అవిశ్వాసాలు పెట్టకుండా అడ్డుపడిన సంగతిని ఆయన గుర్తుచేశారు. ఎంతో కష్టపడిన తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ అవిశ్వాసాలకు బ్రేక్ వేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

గెలుపోటములు సహజం

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సూచించారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్లలో శుక్రవారం ఆయన క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ యువత క్రీడలపై ఆసక్తి చూపడం మంచి పరిణామమన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భూపాలచారి, ఎంపీటీసీ మంగమ్మ, బీఆర్‌ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు సయ్యద్, నాయకులు నవీన్ రెడ్డి, బాబురావు, గౌస్, శేఖర్, శివ, కుమార్ పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న అంజయ్యయాదవ్

'చలో పార్లమెంట్'ను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చేవెళ్ల: ప్రజలందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ)తో పాటు 16 విద్యార్థి సంఘాలు చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్‌కుమార్, శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేందుకు అందరికీ ఉచిత విద్య, ఉపాధి కల్పించాలనే డిమాండ్‌తో జనవరి 12వ తేదీన చలో పార్లమెంట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చలో పార్లమెంట్‌ను విజయవంతం చేయాలని కోరారు. దేశంలో నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరిగిపోతోందని తెలిపారు. ప్రతి ఏడాది 10లక్షల ఉద్యోగాలు కల్పిస్తానన్న కేంద్ర ప్రభుత్వ హామీ ఏమైందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి



పాఠశాలకు ఫ్యాన్లు అందజేస్తున్న మహేశ్ తదితరులు

ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి

షాబాద్: పేద విద్యార్థులకు సహకారం అందించేందుకు దాతలు ఎంతో కృషి చేస్తున్నారని కుర్వగూడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకురావాలని కోరారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిలోని కుర్వగూడ ప్రాథమిక పాఠశాలలో 2004–2005 సంవత్సరంలో ఐదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు రెండు ఫ్యాన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకొని క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మహేశ్, రామకృష్ణ, ఆనంద్, ప్రవీణ్, నవిత, గ్రామస్తులు తదతరులున్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షిద్దాం



నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: హరితాహారంలో భాగంగా మండల కేంద్రంలోని నర్సరీలో మొక్కలను సిద్ధం చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. నర్సరీలో 11వేల మొక్కలను పెంచేందుకు గాను సంబంధిత అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, కార్మికులతో కలసి బ్యాగ్ ఫిల్లింగ్ పనులు పూర్తిచేశారు. ఇందులో భాగంగా నర్సరీలో జామ, ఉసిరి, కానుగు, గులాబీ, తులసీ, మందార, కరివేపాకు, వేప నీలగిరి తదితర మొక్కలను పెంచేందుకు ఏర్పాట్లు చకచకా సాగుతున్నాయి. గ్రామంలోని నర్సరీని శుక్రవారం సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి పరిశీలించి సిబ్బందికి మొక్కల పెంపకంపై పలు సలహాలు ఇచ్చారు. సర్పంచ్ మాట్లాడుతూ.. గత 5 సంవత్సరాల్లో గ్రామ పంచాయతీ పరిధిలో 80వేల మొక్కలను నాటడం జరిగిందని.. నాటిన ప్రతి మొక్కను పూర్తిస్థాయిలో సంరక్షించామని తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలో నాటిన మొక్కలను తొలగించే వారిపై పంచాయతీ రాజ్ చట్టం–2018ను అనుసరించి చర్యలు తీసుకుంటామన్నారు.